సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



ఘనంగా వెదురు దినోత్సవం

ప్రపంచ వెదురు దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మేదర మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో కులవృత్తిదారులు వెదురుచెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. 9లో▸

ఏఎస్పీ కాజల్‌సింగ్‌కు ప్రమోషన్



ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌కు అదనపు ఎస్పీగా ప్రమోషన్ కల్పిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. యథాస్థానంలో పోస్టింగ్ కల్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బాలింతకు దారి కష్టాలు



పైలెట్ సాయంతో వాగు దాటుతున్న బాలింత

ఇంద్రవెల్లి: సిరికొండ మండలంలోని మారుమూల కన్నాపూర్ పంచాయతీ పరిధి కన్నాపూర్‌తండాకు చెందిన మీనా నిండు గర్భిణి. ఆమెకు ఈ నెల 16న పురుటి నొప్పుల రాగా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మీనా మగ బిడ్డకు జన్మనిచ్చింది. గురువారం వైద్యులు డిశ్చార్జి చేయగా 102వాహనంలో ఆమెను గ్రామానికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఉన్న వాగు ఉధృతికి వాహనం దాటలేకపోయింది. దీంతో పైలెట్ షేక్ సాహిద్ పసిబిడ్డతో ఉన్న బాలింతను వాగు దాటించారు. అక్కడి నుంచి సుమారు కిలోమీటర్ దూరం వరకు కాలినడకన వెళ్లి వారు గ్రామానికి చేరుకున్నారు.

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి



జిల్లా జైలు వద్ద డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: నిరుపేద ఖైదీలు డిఫెన్స్ కౌన్సిల్ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం సూచించారు. గురువారం జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో కలిసి జిల్లా జైలును సందర్శించారు. న్యాయాన్ని పొందే విధానాన్ని ఖైదీలకు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉమేశ్‌రావు జోలే, జాదవ్ సంగీత, తిలోత్తమ, రూపేశ్ ఉన్నారు.

ఆకట్టుకున్న ఫ్రెషర్స్‌డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు జానపద, సినీ గీతాలపై నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ సంగీత మాట్లాడుతూ.. సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహభావం పెంపొందించేందుకు ఫ్రెషర్స్‌డే నిర్వహించినట్లు తెలిపారు. లెక్చరర్లు జగ్‌రాం, సంతోష్, శ్రావణి, చక్రవర్తి, అరుణ్‌కుమార్, రమాకాంత్, రవికిరణ్, శ్రీధర, జ్యోత్స్న, రాజ్‌కుమార్, అష్రఫ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్సై

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సన్‌షైన్ స్కూల్‌లో గురువారం జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లేశ్, బొంగురాల గౌతం తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం, పాఠశాల యాజమాన్యం రాకేశ్, గణేశ్, ప్రిన్సిపాల్ విజయ్, పీఈటీలు సాయిరాం, హరీశ్, అనూష, లక్ష్మి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫ్లడ్ మేనేజ్‌మెంట్ శిక్షణకు ఈఈ

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల ఎంసీహెచ్‌ఆర్‌డీఏలో గురువారం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై ప్రారంభించిన మూడురోజుల శిక్షణ కార్యక్రమానికి ఆదిలాబాద్ మున్సిపల్ ఇంజినీర్ పేరిరాజు హాజరయ్యారు. పట్టణాల్లో భారీ వర్షాల కారణంగా తలెత్తే వరదలను ఎలా నియంత్రించాలి.. వరద ముప్పు వాటిల్లకుండా అనుసరించాల్సిన కార్యాచరణపై నిపుణులైన ఇంజినీరింగ్ అధికారులు శిక్షణలో అవగాహన కల్పించనున్నారు.

ఇందిరమ్మా.. ఇదేందమ్మా?

- నిర్మాణాల్లో అక్రమాలు మరూ..
- అనర్హురాలి పేరిట స్వాహాపర్వం!
- వెలుగులోకి పలు ఉదంతాలు
- అవినీతి ఆరోపణలతో నర్సాపూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్



ఇచ్చోడ మండలం నర్సాపూర్‌కు చెందిన ముస్లే నందాబాయి (భర్త సంతోష్) ఇంటి ప్రొసీడింగ్



ఇది ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామంలో బేస్మెంట్ వరకు పూర్తయిన ఇంటి నిర్మాణం. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం ఇది ఇందిరమ్మ ఇల్లు. కానీ.. దీనిని నిర్మిస్తున్న మహిళ నందాబాయికి ఇల్లు మంజూరు కాలేదు. విషయమేమిటంటే ఈ ఇల్లు నిర్మిస్తున్న మహిళ పేరుతో ఈ గ్రామంలో మరో మహిళ ముస్లే నందాబాయి ఉంది. ఈమెనే అసలు లబ్ధిదారు కాగా, ఇంకా ఇంటి నిర్మాణం ప్రారంభించలేదు. కానీ.. పంచాయతీ కార్యదర్శి ఇక్కడ అక్రమాలకు తెరలేపాడు. విడతలవారీగా వచ్చే సబ్సిడీ సొమ్మును కాజేయాలనే దురుద్దేశంతో ఈ చర్యకు పాల్పడ్డాడు.

జిల్లాలో ఇందిరమ్మ పథకం వివరాలు

మంజూరైన ఇండ్లు	9,214
నిర్మాణాలు మొదలైనవి	7,615
బేస్మెంట్ దశలో ఉన్నవి	4,483
రూఫ్ లెవల్ దశలో ఉన్నవి	837
స్లాబ్ పూర్తయినవి	183
నిర్మాణం పూర్తయినవి	3
పీవీటీజీలకు మంజూరైనవి	5,080
నిర్మాణాలు మొదలైనవి	0

సాక్షి, ఆదిలాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు మొదలయ్యాయి. తాజాగా ఇచ్చోడ మండలం నర్సాపూర్‌లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. ఒకే పేరున్న ఇద్దరు మహిళల్లో ఒకరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ఆమె నిర్మాణమే ప్రారంభించలేదు. ఇక అదే పేరుతో ఉన్న మరో మహిళకు ఇల్లు మంజూరు కాకపోయినా పంచాయతీ కార్యదర్శి ఆమెతో ఇంటి నిర్మాణం మొదలుపెట్టించాడు. మొదటి విడతలో రూ.లక్ష రాగా, ఆ డబ్బులు అసలు లబ్ధిదారు ఖాతాలో పడటం, ఈ విషయంలో వివాదం చెలరేగడం, అసలు లబ్ధిదారును మభ్యపెట్టి పంచాయతీ కార్యదర్శి ఖాతాలో నుంచి తీసుకోవడం జరిగిపోయింది. ఈ రాద్ధాంతంపై కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు డీపీవో రమేశ్, డీఎల్పీవో ఫణిందర్‌రావు విచారణ చేపట్టారు. దీంట్లో పంచాయతీ కార్యదర్శి సునీల్‌నాయక్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. కలెక్టర్ ఆదేశాలతో అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇప్పుడు ఈ ఘటన జిల్లాలో ఇందిరమ్మ పథకంలో జరుగుతున్న అక్రమాలను తేటతెల్లం చేస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

ఇందిరమ్మ లబ్ధిదారుకు ప్రభుత్వం నుంచి మంజూరు పత్రం ఇస్తారు. ఇందులో లబ్ధిదారు ఫొటో ఉండాలి. నర్సాపూర్ ఉదంతంలో ప్రొసీడింగ్‌పై లబ్ధిదారు ఫొటో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. లబ్ధిదారు ఆధార్, మొబైల్ నంబర్లు అందులో నమోదు చేయాలి. దాని ఆధారంగా ప్రతీ నిర్మాణ దశకు సంబంధించి ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అలాంటప్పుడు ఒకరికి మంజూరైన ఇల్లు మరొకరు ఎలా నిర్మిస్తారనేది అంతుచిక్కని ప్రశ్నే. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రతీ దశలో పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలుకుంటే స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఆపై స్థాయి అధికారులు పర్యవేక్షించాలి. అసలు లబ్ధిదారు ఇంటి నిర్మాణం చేపట్టకముందే ఆమె ఖాతాలో డబ్బులు ఎలా జమ అయ్యాయనేది అధికారులే చెప్పాలి. డబ్బులు కాజేయాలనే దురుద్దేశంతోనే ఈ వ్యవహారం పకడ్బందీగా సాగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంపిక విధానం ఇలా..

ప్రభుత్వం అర్జీల ఆధారంగా ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసింది. అర్హుల జాబితాలు స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎంపీడీవోలకు అందాయి. వాటిని పరిశీలించి మొదట స్థలాలు ఉన్నవారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. మండలాల్లో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవోలు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్లు కలిసి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఎంపీడీవో లాగిన్ ద్వారా కలెక్టర్, కలెక్టర్ లాగిన్ నుంచి గృహ నిర్మాణశాఖ ప్రధాన కార్యాలయానికి చేరింది. ఇందుకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరిగింది. లబ్ధిదారుకు ఒక్కో యూనిట్ కింద ఇచ్చే రూ.5లక్షలను పూర్తి సబ్సిడీతో ప్రభుత్వం విడతలవారీగా అందించనుంది.

కార్యదర్శిని సస్పెండ్ చేశాం

ఇచ్చోడ మండలం నర్సాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వచ్చిన ఆరోపణల మేరకు కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టాం. కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశాం.
– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

లబ్ధిదారులకు బిల్లులు మంజూరు

జిల్లాలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.53.20కోట్లు చెల్లించాం. మొదట ప్రతీ మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఒక గ్రామాన్ని తీసుకున్నాం. ఏప్రిల్‌లో అన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు ప్రారంభించాం.
– బస్వేశ్వర్, హౌసింగ్ పీడీ



ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ నుంచి సుభాష్‌నగర్ గుండా ప్రవహించే పెద్దవాగును ఆనుకునే ఓ వాణిజ్య భవనంతో పాటు పలు ఇళ్లు నిర్మించగా అధికారులు పరిశీలిస్తున్నారు. ఇవన్నీ బఫర్‌జోన్‌లోనే ఉన్నట్లు గుర్తించారు.



ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ సమీపంలో ఏకంగా వాగులోనే ప్రహరీ, మరుగుదొడ్డి నిర్మించారు. ఇవీ బఫర్‌జోన్‌లోనే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇలాంటి వాటి కారణంగానే వాగు నీటి ప్రవాహం సక్రమంగా జరగక వరదలు వస్తున్నట్లు అధికారులు అంచనాకు వస్తున్నారు.

‘బఫర్’ గండం!

- వాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా అడ్డగోలుగా అక్రమ కట్టడాలు
- వంద ఆక్రమణలున్నట్లు నిర్ధారణ
- బల్దియాకు ఏటా వరద ముప్పు
- కలెక్టర్ చర్యలపైనే సర్వత్రా ఆసక్తి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని బఫర్ జోన్ ఆక్రమణల లెక్కతేలింది. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు కొద్దిరోజులుగా వివిధ కాలనీల్లోని వాగుల గుండా మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు సంయుక్త పరిశీలన చేపట్టారు. బఫర్‌జోన్ పరిధిలో వందకు పైగా ఆక్రమణలున్నట్లు గుర్తించారు. అక్రమ నిర్మాణాలకు బాధ్యులెవరనే ప్రశ్న తలెత్తుతుండగా, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆదిలాబాద్ పట్టణంలోని పలు లోతట్టుప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వాగులు, కాలువలు సాఫీగా ప్రవహించే మార్గం లేక వరద ఉప్పొంగి పలు కాలనీల్లో ఇండ్లలోకి వరదనీరు చేరింది. లోలెవల్ వంతెనలు ఉధృతంగా ప్రవహించడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచాయి. వాహనాలు కొట్టుకుపోవడంతో పాటు రోడ్లు, బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిపై ఇటీవల మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా ఈ పరిస్థితికి కారణమేంటనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. బఫర్‌జోన్‌లోని ఆక్రమణలు గుర్తించేందుకు మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్త పరిశీలన చేపట్టి నివేదిక అందించాలని సూచించారు.

భారీ సంఖ్యలో ఆక్రమణలు

కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులు మావల అటవీ ప్రాంతం నుంచి గ్రీన్‌సిటీ వరకు ప్రవహించే వాగు బఫర్ జోన్‌ను సందర్శించారు. దుర్గానగర్, కోజాకాలనీ, ఆదర్శనగర్, దస్నాపూర్, రాంనగర్, సుభాష్‌నగర్, గ్రీన్‌సిటీ కాలనీల్లోని వాగు గుండా ఉన్న నిర్మాణాలు పరిశీలించారు. వీటి పరిధిలోని వాగుకు ఇరువైపులా ఉన్న బఫర్‌జోన్‌లో భారీగా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఇండ్లు, వాణిజ్య భవనాలతో పాటు ప్రహరీలు, మరుగుదొడ్లు, స్నానపుగదులు లాంటి వందకు పైగా అక్రమ నిర్మాణాలున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఆదర్శనగర్, గ్రీన్‌సిటీలో వాగు నీటి ప్రవహం సాగకుండా అడ్డుగా నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. రాంనగర్, సుభాష్‌నగర్‌లో ఏకంగా వాగులోనే నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. సుభాష్‌నగర్‌లో వాగుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు బఫర్‌జోన్ పరిధిలోనే ఉన్నట్లు గుర్తించారు. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఆ వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్ రాజర్షి షాకు అందించనున్నారు.



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుభాష్‌నగర్‌లో ఓ ఇంటి చుట్టూ చేరిన వరదనీరు

ఈ దుస్థితికి బాధ్యులెవరు?

బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అయితే ఆదిలాబాద్ పట్టణ పరిధిలో ఇంత పెద్ద మొత్తంలో అక్రమ నిర్మాణాలు జరగడానికి బాధ్యులెవరనే ప్రశ్న తలెత్తుతోంది. వాటిపై చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు ఏం చేశారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వదిలేశారని, ఆయా శాఖల వైఫల్యంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వరదలు సంభవించడానికి పరోక్షంగా ఆయా శాఖల తీరే కారణమనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే.. ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా? అనేది చర్చనీయాంశమైంది.

స్వచ్ఛందంగా తొలగించుకోవాలి

బఫర్‌జోన్ పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల కారణంగా వరదనీరు ఇళ్లలోకి వస్తోంది. పట్టణంలోని వాగు గుండా ఉన్న ఆక్రమణలను ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి గుర్తించాం. కలెక్టర్‌కు నివేదిక అందిస్తాం. కలెక్టర్ ఆదేశాలకనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆక్రమణదారులే స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించుకోవడం మంచిది.
– సుమలత, పట్టణ ప్రణాళికాధికారి

క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. కొంతసేపు మైదానంలో బ్యాట్ పట్టి క్రికెట్ ఆడారు. ఏడు జట్లు పోటీల్లో పాల్గొనగా మొదటి విజేతగా నిలిచిన సూపర్‌స్ట్రైకర్స్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆదిలాబాద్ రాయల్ జట్టుకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, నాగేందర్, ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు సునీల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి

ఈనెల 22నుంచి ప్రారంభమవుతున్న శరన్నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుర్గాదేవి, శారద మాత మండపాల నిర్మాణంలో నాణ్యమైన వస్తువులు, వైర్లను వినియోగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సెక్టార్లు, క్లస్టర్లుగా విభజించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్, జైనథ్, ఆదిలాబాద్‌రూరల్ సీఐలు సునీల్‌కుమార్, నాగరాజు, ప్రణయ్‌కుమార్, సాయినాథ్, ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ

సంకల్ప్ సెమినార్‌లో కలెక్టర్



సెమినార్‌లో కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో గురువారం సంకల్ప్ సెమినార్ నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఢిల్లీ ప్రతినిధులతో పాటు రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ హాజరై శిశు మరణాలను తగ్గించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో శిశు మరణాల రేటు 13.4 ఉండగా, 10 శాతానికి తెచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలి

బజార్‌హత్నూర్: ఆదివాసీల హక్కులను హరిస్తున్న లంబాడాలను వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌కు జాతర్ల, మడగూడ రాయిసెంటర్ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. లంబాడాలకు అక్రమంగా ఎస్టీ హోదా కల్పించడంతో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించాలని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేదాకా లంబాడాలకు కుల ధ్రువీకరణ పత్రాల జారీని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మొనోజ్, మహిళా అధ్యక్షురాలు ఉయికే ఇంద్ర, సంఘం నాయకులు ఉయికే సుదర్శన్, నైతమ్ రమేశ్, రాయ్ సెంటర్ల పటేళ్లు సార్‌మేడి ఈశ్వర్, నాగోరావు మహజన్లు, దేవరీలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని వరంగల్ ఆర్జేడీ, రాష్ట్ర పరిశీలకుడు సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్‌అర్బన్ కేజీబీవీ, భవిత రిసోర్స్ సెంటర్, తాటిగూడ, యాపల్‌గూడ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, కంప్యూటర్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్‌ఆర్‌ఎస్, ఎఫ్‌ఎల్‌ఎన్, డైస్, పీఎం పోషణ్, పీఎంశ్రీ పథకాల నిర్వహణ, మరుగుదొడ్లు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించారు. సెక్టోరియల్ అధికారులు తిరుపతి, రఘురమణ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడా ఎంపీపీఎస్‌ను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్, ఎఫ్‌ఎల్‌ఎన్ రికార్డులు, టీఎల్‌ఎం సామగ్రి, లైబ్రరీ, ఏఐ తరగతులు, ఆన్‌లైన్ రిపోర్టులు, పీటీఎం సమావేశ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు. బడి వాతావరణం, విద్యార్థుల పఠనాసక్తి, ఉపాధ్యాయుల కృషిపై సంతృప్తి వ్యక్తంజేశారు.



ఆదిలాబాద్ టౌన్: విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మోదీ నాయకత్వంలోనే దేశభద్రత



గుడిహత్నూర్: రక్తదాతలతో ఎంపీ గోడం నగేశ్



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గుడిహత్నూర్: ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశభద్రత సాధ్యమని ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక శివకల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఉన్నంత వరకు దేశానికి ఎలాంటి ఆపద రాదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, రైల్వే బోర్డు సభ్యుడు బోసారే గణేశ్, నాయకులు కేంద్రే శివాజీ, కేంద్రే లక్ష్మణ్, భరత్, వామన్‌గిత్తే, కేంద్రే కుమార్, రాజేంద్రప్రసాద్, బోడ్కే జగన్, స్థానిక బ్లడ్ మ్యాన్ లోఖండే అనిల్, రిమ్స్ వైద్య సిబ్బంది ఉన్నారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి

ఆదిలాబాద్: ప్రధాని మోదీ పాలనలో దేశాభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా గురువారం ఖానాపూర్ చెరువు కట్ట సమీపంలోని బతుకమ్మ ఘాట్ వద్ద సేవా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పరిపాలన దక్షతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17నుంచి అక్టోబర్ 2వరకు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, నాయకులు విజయ్, కృష్ణ, రవి, రాజేశ్, దినేశ్ మటోలియా, రాజేశ్, ప్రవీణ్, ముకుంద్‌రావు, అశోక్‌రెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

సాత్నాల: మండలంలోని జామ్నీ, జంగుగూడా గ్రామాలకు చెందిన పలువురు గురువారం బీజేపీలో చేరగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. నాయకులు కరుణాకర్‌రెడ్డి, అస్తక్ సుభాష్, రమేశ్, రోహిదాస్, రాము, మీరాబాయి, రేణుక భాయ్, అశోక్‌రెడ్డి, ఆనంద్‌రావు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

భవనం.. శిథిలమయం



శిథిలావస్థకు చేరిన భవనం



పైకప్పు నుంచి గోడలకు దిగిన ఊడలు

కలెక్టరేట్ ఆవరణలోని సబ్ పోస్టాఫీస్ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాలకు భవనం గోడలు పాకురు పట్టాయి. పక్కనే ఉన్న మర్రి వృక్షాల ఊడలు గోడల్లోకి దిగాయి. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. ప్రమాదం జరగకముందే తొలగిస్తే మంచిదని సందర్శకులు భావిస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


గాయపడిన మహిళ

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటపల్లి మండలం పుల్లగామకు చెందిన అత్రం స్వరూపకు తీవ్రగాయాలైనట్లు ఎస్సై శ్వేత తెలిపారు. బ్యాంక్ పనిమీద సమీప బంధువుతో కలిసి బైక్‌పై పుల్లగామ నుంచి మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా భీమారం వద్ద కళ్లు తిరిగి కింద పడిపోయింది. తీవ్రగాయాలు కావడంతో 108కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన కమలేష్ కుమార్ తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని గురువారం పార్కింగ్ చేశాడు. భీంపూర్ మండలంలోని నిపానికి చెందిన పెందూర్ సంతోష్, కుమ్ర శంకర్ బైక్ చోరీకి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్తున్న వారిని చూసి బాధితుడు డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుమ్ర శంకర్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించగా, పెందూర్ సంతోష్ పరారీలో ఉన్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా బి, ముత్నూర్‌లోని బెల్ట్‌షాపులపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. దనోరా బిలో రూ.14 వేలు, ముత్నూర్‌లో రూ.6 వేల విలువైన మద్యం లభించినట్లు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని పసరే ఆకాష్, దుర్గ్వవార్ దత్తపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సూర్యనగర్‌లో వ్యభిచార గృహంపై గురువారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అంబేడ్కర్ కాలనీకి చెందిన సామిళ్ల రాకేష్‌తో పాటు ఇద్దరు మహిళలను, గోదావరిఖనికి చెందిన కావేటి సురేష్, కొండ విజయ్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. సూర్యానగర్‌కు చెందిన ఓ మహిళ ఇతర ప్రాంతాల నుంచి మహిళలను పిలిపించి తన ఇంట్లోనే చీకటి వ్యాపారం నడిపిస్తోందన్నారు. నిర్వాహకులు, విటులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైక్ చోరీ

లక్ష్మణచాంద: ద్విచక్ర వాహనం చోరీ చేసిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. రుద్రజడ రవికి చెందిన బైక్‌ను గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గమనించిన రవి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. శ్రీనివాస్ తెలిపారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య


పృథ్వీరాజ్ (ఫైల్)

బెల్లంపల్లి: భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకుని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై సీహెచ్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన కుజ్జూర్ పృథ్వీరాజ్ (37)కు తాళ్లపల్లి సుప్రియతో 2018లో వివాహమైంది. అప్పటి నుంచి పృథ్వీరాజ్ తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి గొడవపడేవాడు. దీంతో సుప్రియ గత జూన్‌లో మంచిర్యాలకు వెళ్లిపోయింది. ఇంటికి రావాలని పలుమార్లు కోరినా నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని తల్లి కుజ్జూర్ కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

దస్తురాబాద్: మండలంలోని రాంపూర్, మున్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో గురువారం ఐదుగురిపై పిచ్చికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. మున్యాలకు చెందిన హర్షవర్ధన్, రాంపూర్‌కు చెందిన బుస హర్ష, భూత్కూర్‌కు చెందిన కాల్వ బాలయ్య, దస్తురాబాద్‌కు చెందిన నిశ్విత్, అయేషాలను గాయపర్చడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్సను అందించి మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

కలప పట్టివేత

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామ సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో కలప పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన లక్ష రూపాయల విలువైన కలప లభించినట్లు తెలిపారు. కలపను స్వాధీనం చేసుకుని ఫంక్షన్ హాల్ యజమాని మొహమ్మద్ మూసా, లక్ష్మణ్‌పై కేసు నమోదునట్లు తెలిపారు. కార్యక్రమంలో అమర్ సింగ్, ప్రమోద్ కుమార్, గులాబ్, హైమద్‌ఖాన్, కవిత, కృష్ణ నాయక్, సజన్ లాల్, శ్యాంసుందర్, అర్జున్ నాయక్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్!

- అతిథి అధ్యాపకులకు అందని వేతనాలు
- పండుగకైనా ఇవ్వాలని వేడుకోలు
- ఉమ్మడి జిల్లాలో 225 మంది అతిథి అధ్యాపకులు

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	గెస్ట్ లెక్చరర్లు
నిర్మల్	55
ఆదిలాబాద్	69
ఆసిఫాబాద్	61
మంచిర్యాల	40
మొత్తం	225


తరగతి గదిలో విద్యార్థులకు పాఠం బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు

లక్ష్మణచాంద: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది డిసెంబర్ మాసం నుంచి వారికి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చాలీచాలని వేతనాలతో...

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు చాలీచాలని వేతనాలతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పీరియడ్‌కు రూ.390 చొప్పున నెలకు 72 పీరియడ్లు విద్యార్థులకు పాఠాలు బోధించాల్సి ఉంటుంది. నెలలో 72 పీరియడ్‌లు బోధిస్తే రూ.28,080 వేతనం వస్తుంది. రెగ్యులర్ అధ్యాపకులకు సరిసమానంగా పనిచేస్తున్నా అరకొర వేతనాలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ పోషణకు అప్పులు

గతేడాది డిసెంబర్ నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇతరుల వద్ద అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు రావాల్సిన ఎనిమిది నెలల వేతనాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. లేదంటే దసరా పండుగకు తమ కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు.

వేతనాలు చెల్లించాలి



ఎనిమిది నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– చిరంజీవి, అతిథి అధ్యాపకుడు

పండుగకు పస్తులే



ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకుంటే ఈ దసరా పండుగకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి ఎనిమిది నెలల వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నాం.

– ముత్యం, అతిథి అధ్యాపకుడు

ప్రభుత్వానికి నివేదించాం



అతిథి అధ్యాపకులకు వేతనాలు విడుదల చేయాలని ఇదివరకే ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– పరశురాం నాయక్, డీఐఈవో, నిర్మల్

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన ఒక మూగ బాలికపై అదేగ్రామానికి చెందిన మంగారపు యశ్వంత్ లైంగికదాడి చేశాడు. ఈ మేరకు నమోదైన పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో మంచిర్యాల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాసనాయక్ నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.12,500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. భీమారానికి చెందిన మహిళ 2022 ఏప్రిల్ 26న తమ కుమార్తె (14)ను కూల్‌డ్రింక్ తెమ్మని దుకాణానికి పంపించింది. ఎంతకూ తిరిగిరాకపోవడంతో వెతుకుతుండగా అదే వీధిలో మంగారపు రాజయ్య ఇంటి వద్ద చెప్పులు కనిపించాయి. తలుపు గడియపెట్టి ఉంది. లోపల ఉన్న కుమార్తె పరిస్థితి చూసి లైంగికదాడి జరిగినట్లు గుర్తించింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు. శ్రీరాంపూర్ సీఐ రాజు విచారణ జరిపించి నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా మంచిర్యాల ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులో విచారణ చేపట్టారు. నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇప్పించాలని డీఎల్ఎస్ఏకు లేఖ రాశారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేత, కోర్టు సీడీవో ధర్మయ్య, వెంకటేశ్వర్లు, గోవిందరావును రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో..

ఆసిఫాబాద్‌అర్బన్: బాలికపై అత్యాచారం చేసిన పోక్సో కేసు నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ.రమేశ్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఓ మండలానికి చెందిన బాలిక (8)అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఇంటి పరిసర ప్రాంతంలో ఉండే మరప రామేశ్వర్ 2023 డిసెంబర్ 10న సదరు బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు కడుపునొప్పి రావడంతో లైంగిక దాడి విషయాన్ని తల్లికి చెప్పింది. బాధితురాలి తల్లి 2023 డిసెంబర్ 12న జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సందీప్ (మొదటి ఐవో) కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ చిత్తరంజన్, సీఐ రమేశ్, ఎస్సై రవికుమార్‌ను ఎస్పీ అభినందించారు.

జోర్డాన్‌లో అంబకంటి యువకుడు మృతి


రవికుమార్ (ఫైల్)

కుంటాల: మండలంలోని అంబకంటికి చెందిన బొల్లపల్లి రవికుమార్ (34) పదేళ్ల క్రితం ఉపాధి కోసం జోర్డాన్ వెళ్లి అక్కడి ఎర్బిడ్ పట్టణంలో క్లాసికల్ ఫ్యాషన్ అప్పరల్ ఇండస్ట్రీ లిమిటెడ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితమే ఇదే గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహంకాగా ఐదు నెలల క్రితమే ఇక్కడి నుంచి వెళ్లిపోయాడు. లుకేమియా వ్యాధితో బాధపడుతుండగా అదే కంపెనీలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాంగోపాల్‌ను తోడుగా ఇచ్చి ఇండియాకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. గత ఆగస్టు 30న స్వగ్రామానికి వస్తుండగా షార్జాలో ఫ్లైట్ మార్పే క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో షార్జాలోని అల్ క్వాసిమి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి రానున్నట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

దహెగాం: విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఉత్తం తెలిపిన వివరాల మేరకు పీకల గుండం (చర్చిగూడ)కు చెందిన రైతు గోమాస పోశం (60) గురువారం మధ్యాహ్నం భార్య లాంచుబాయితో కలిసి పొలానికి వెళ్లాడు. మోటర్ ఆన్ చేస్తుండగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు గోమాస అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


శ్రీనివాస్ (ఫైల్)

కుభీర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు పార్డి(కె) గ్రామానికి చెందిన మహార్ శ్రీనివాస్ (30) బుధవారం రాత్రి పుస్పూర్‌లో ఉన్న అత్తగారింటికి బైక్‌పై వెళ్లివస్తుండగా హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపక్కన చెట్టుకు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం పల్సి గ్రామానికి చెందిన వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పార్డి(కె) వాసి శ్రీనివాస్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య ప్రేమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో 14 రోజుల రిమాండ్

కెరమెరి: గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. మండలంలోని కెస్లాగూడ గ్రామ శివారులో బుధవారం తనిఖీలు నిర్వహించగా కినక గోపాల్ తన పంట పొలంలో 10 గంజాయి మొక్కలు సాగు చేసినట్లు గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి గురువారం ఆసిఫాబాద్ కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి నిందితునికి 14 రోజుల రిమాండ్ విధించారు. గంజాయి సాగు, విక్రయం చేస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

సోన్: మండల కేంద్రంలోని బ్రాహ్మణమఠంలో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మండల కేంద్రానికి చెందిన శివరాత్రి సేనాపతి జల్సాలకు అలవాటుపడ్డాడు. ఇటీవల బ్రాహ్మణమఠం తాళం పగులగొట్టి అందులో ఉన్న అతి పురాతనమైన వంటసామగ్రిని ఎత్తుకెళ్లాడు. వాటిని విక్రయించగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునేవాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతన్ని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటి భవనానికి సంబంధించి ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని గంజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన సురేష్ మకాడియా 2002లో కన్నలాల్ నుంచి భవనాన్ని కొనుగోలు చేశాడు. కొనుగోలుదారుని ఆధీనంలో ఉన్నప్పటికీ వినియోగంలో లేదు. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన రంగినేని దీపక్ ఫోర్జరీ పత్రాలు సృష్టించి మున్సిపాలిటీలో పన్ను చెల్లించాడు. అనంతరం రిజిస్ట్రేషన్ అధికారులను పక్కదోవ పట్టించి తన బావ అయిన నరేందర్ దీపక్ దడిగెలవార్ పేరిట 2023లో రిజిస్ట్రేషన్ చేయించాడు. సాక్షులుగా ఆకులవార్ నగేష్, ఆదర్శ్ ఉన్నారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అటవీ భూమి సాగుచేస్తున్న ఇద్దరిపై..

కుంటాల: కుంటాల బీట్ పరిధిలోని రాయపాడ్ శివారు రిజర్వు ఫారెస్ట్‌లో బుధవారం రాత్రి అక్రమంగా అటవీభూమి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎఫ్ఆర్వో రాథోడ్ రమేశ్ తెలిపారు. అంబకంటి తండాకు చెందిన ఆడే సత్యవన్, ఆడే దత్తురాం అనుమతి లేకుండా ట్రాక్టర్‌తో అటవీ ప్రాంతంలో దుక్కి దున్నుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డీఆర్వో రేష్మ, ఎఫ్‌బీవో సంజయ్ పాటిల్, హరిలత, పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

జైపూర్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన కావేరి పార్దు జాతీయ స్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కోల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదరు విద్యార్థిని పీడీ సంతోశ్, పీఈటీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాళ్లు స్రవంతి, మహిపాల్ అభినందించారు.

అవకాశాలను అంది పుచ్చుకోవాలి



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రాజేంద్రసింగ్

చెన్నూర్‌రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఆచార్య రాజేంద్రసింగ్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులు లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.కిశోర్‌కుమార్, అధ్యాపకులు చక్రపాణి, కృష్ణారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: 'ఇందిరమ్మ ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదిలాబాద్ డీపీవో రమేశ్, డీఎల్‌పీవో ఫణిందర్‌రావు నర్సాపూర్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారు ముస్లే నందబాయి భర్త సంతోష్, బేస్‌మెంట్ వరకు ఇల్లు నిర్మించుకున్న ముస్లే నందబాయి భర్త మారుతిని విచారించారు. గ్రామస్తులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడారు. నివేదికను కలెక్టర్ రాజర్షిషాకు అందజేయనున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి చేతివాటం..

ఇందిరమ్మ ఇల్లు మంజూరులో పంచాయతీ కార్యదర్శి సునీల్ నాయక్ చేతి వాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ముస్లే నందబాయి (భర్త సంతోష్)కు జూన్ 2న ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. కానీ సంతోష్ దుబాయ్‌లో ఉండడంతో అతను వచ్చాక ఇంటినిర్మాణ పనులు చేపట్టే విధంగా కుటుంబ సభ్యులు ప్లాన్ వేసుకున్నారు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న ముస్లే నందబాయి (భర్త మారుతి)కి మంజూరు కాలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి సునీల్‌నాయక్ రంగంలోకి దిగి మీరు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మంజూరు విషయం తాను చూసుకుంటానని వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీంతో వారు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. నెల రోజుల క్రితం దుబాయ్‌లో ఉంటున్న సంతోష్ స్వగ్రామానికి వచ్చి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఇంతలో బేస్‌మెంట్ నిర్మాణ బిల్లు రూ.లక్ష ముస్లే నందబాయి (భర్త సంతోష్) బ్యాంక్ అకౌంట్‌లో జమకావడంతో పంచాయతీ కార్యదర్శి వారిని నమ్మించి వారి అకౌంట్ నుంచి నందబాయి (భర్త మారుతి) అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేశాడు. దీంతో కార్యదర్శిని నిలదీయడంతో వారం రోజుల్లో లక్ష రూపాయలు తిరిగి ఇస్తానని ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. ఇల్లు మంజూరైన బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు కలెక్టర్ నివేదిక ఇచ్చిన తర్వాత అసలు నిజాలు బయటపడతాయని నర్సాపూర్‌లో జోరుగా చర్చ జరుగుతోంది.

జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు


హాజరైన క్రీడాకారులతో అధికారులు, పీడీలు

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ ఎక్స్‌లెంట్ పాఠశాలలో గురువారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17 జిల్లాస్థాయి బాలుర వాలీబాల్ ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సుమారు 200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అక్టోబర్‌లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, ఎస్సై గొల్లపెల్లి అనూష, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్, స్లేట్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు సుభాష్‌రెడ్డి, చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, ఫణిరాజు, ఎస్జీఎఫ్ నాయకులు బెల్లం శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, సిరంగి గోపాల్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రోజీ వరకుమారి, సాగర్, పీడీలు సంతోష్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయికి ఎంపికైంది వీరే..

జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చిన 18 మంది జోనల్ స్థాయికి ఎంపికైనట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్ తెలిపారు. ఎంపికైన వారిలో రాకేశ్, ప్రణయ్ (ముల్కల్ల), కార్తీక్, అనిల్ (కొత్తపల్లి), సాయి ప్రదీప్ (మంచిర్యాల), సాయి దీక్షిత్ (మంచిర్యాల), ఇలియాజ్‌ఖాన్ (తాళ్లపేట్), విగ్నేశ్ (రెబ్బనపల్లి), ఘనతేజ, అరుణ్ (లక్సెట్టిపేట), అఖిలేశ్, రుతిన్(బెల్లంపల్లి), భానుచందర్, దిలీప్ (జన్నారం), అజయ్ (చింతగూడ), ప్రణయ్‌కుమార్ (జైపూర్) అద్వైత్ (గర్మిళ్ల), వర్షిత్ (వెంకటపూర్) ఉన్నారు.

'గడ్డెన్నవాగు'కు భారీ ఇన్‌ఫ్లో



భైంసా పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. గురువారం ఉదయం ప్రాజెక్టుకు 13,277 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేశారు. సాయంత్రం ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేటును మూసి, ఒక గేట్ ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లకుగానూ ప్రస్తుతం 358.40 మీటర్ల నీటినిల్వ ఉంది.

– భైంసాటౌన్

40 శాతం లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి 6 నెలలు కావస్తున్నా ఇప్పటికీ లాభాల లెక్క తేల్చలేదన్నారు. కార్మికులు కష్టపడి పని చేస్తేనే లాభాలు వచ్చాయని, వాటా పంచడానికి జాప్యం ఎందుకు చేస్తున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, మంద కమలాకర్, మేకల స్వామి తిరుపతి, మోతే ఓదెలు, రాజు, చెల్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుండెనొప్పిని గుర్తించలేని ఆస్పత్రి

- బోథ్ సీహెచ్‌సీకి నిర్లక్ష్యపు జబ్బు..
- ఈసీజీ పేపర్ కూడా లేని వైనం
- ఛాతినొప్పితో వచ్చిన వ్యక్తికి ప్రథమ చికిత్స కూడా అందించని సిబ్బంది

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కనీస వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో కనీసం ఈసీజీ తీయడానికి పేపర్ కూడా లేని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన అబ్దుల్ రహీమ్‌కు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో వెంటనే బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాడు. డ్యూటీలో ఉన్న వైద్యుడు ఈసీజీ తీయాలని చెప్పాడు. మిషన్‌లో పేపర్ లేకపోవడం వల్ల రిపోర్ట్ తీసుకోలేకపోయారు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈసీజీ, 2 డికో పరీక్షలు చేసిన వైద్యులు హృదయ సంబంధిత సమస్యగా నిర్ధారించారు. బాధితుడి బంధువులు గురువారం బోథ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌ను కలిసి ఘటనపై ఫిర్యాదు చేయగా ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదని చెప్పడం గమనార్హం.

పోలీసులపై దాడి కేసులో ఒకరి అరెస్టు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో గత నెలలో ముల్తానీలు పోలీసులపై దాడి చేసిన ఘటనలో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. మండలంలోని చెలుకగూడ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు మొక్కలు నాటే క్రమంలో కేశవపట్నం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులతో కలిసి ప్రధాన నిందితుడు అల్తాఫ్ పోలీసులపై రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో స్థానిక ఎస్సైతో పాటు ఐదుగురు స్పెషల్ పార్టీ పోలీసులు గాయాలపాలయ్యారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అల్తాఫ్‌ను గురువారం సిరిచెల్మలో అరెస్ట్ చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. కాగా నిందితుడిపై ఇప్పటికే 8 కేసులు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.

మంచిర్యాలలో నకిలీ సిగరేట్లు!

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో నకిలీ సిగరేట్లు కలకలం రేపాయి. ఇంటర్నేషనల్ కార్పొరేట్ విజిలెన్స్ అధికారులు గురువారం పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కృష్ణ జనరల్ స్టోర్స్, పవన్ కిరాణ స్టోర్స్‌లో నకిలీ గోల్డ్ ఫ్లాక్ సిగరేట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగేశ్వర్‌రావు, రమాకాంత్, స్థానిక ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పొచ్చెర జలపాతంలో రివర్ రాఫ్టింగ్


రివర్ రాఫ్టింగ్ చేస్తున్న అధికారులు

బోథ్: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పొచ్చెర జలపాతం వద్ద గురువారం రివర్ రాఫ్టింగ్ నిర్వహించారు. పొచ్చెర నుంచి కుప్టి వరకు సుమారు 6 కిలోమీటర్ల దూరాన్ని ఒకటిన్నర గంటల వ్యవధిలో ట్రయల్ రాఫ్టింగ్ చేశారు. వర్షాకాలంలో రాఫ్టింగ్ నిర్వహించేందుకు అటవీ అధికారులు చేసిన ప్రతిపాదనలపై శుక్రవారం జరగబోయే టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ జిల్లా సమావేశంలో ప్రస్తావించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎఫ్ఆర్వో ప్రణయ్, ఇంద్రవెల్లి ఎఫ్ఆర్వో సంతోష్, కోయినా అడ్వెంచర్ టీమ్, రివర్ రాఫ్టింగ్ సభ్యులు పాల్గొన్నారు.